క్లుప్తంగా

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఆత్మకూర్: పట్టణంలోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తలు గతేడాది చంద్రుడిపైకి పంపిన చంద్రయాన్–3 విజయవంతమైన నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు, 23ను జాతీయ స్పేస్ డే గా ప్రకటించిందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన చంద్రాయన్ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఖిల్లాఘనపురం: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన రామస్వామికి చెందిన సెల్‌ఫోన్‌ను సుమారు ఏడాది క్రితం బస్టాండులో చోరీకి గురైంది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని సీఈఐఆర్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకొని రికవరీ చేశామన్నారు. శుక్రవారం రామస్వామికి సెల్‌ఫోన్ అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అమరచింత: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వంద మంది పోలీసులు చేసే పనిని ఒక సీసీ కెమెరా చేస్తుందన్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు తమ వంతు కృషి చేయాలని కోరారు. గ్రామంలో చోరీలు, గొడవలు జరిగినా.. నిందితులను వేగంగా పట్టుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

పీఆర్సీని వెంటనే అమలుచేయాలి : తపస్



పాన్‌గల్: పీఆర్సీతో పాటు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ శశివర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు రేమద్దుల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కస్తూర్బా ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలని, బీఈడీ పూర్తిచేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంగా పదోన్నతి కల్పించాలని, 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వీరశేఖరాచారి, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మండల కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల నిరసన

వనపర్తి రూరల్: 2014ఆగస్టు 23న విడుదలైన జీఓ నంబర్ 28 వ్యతిరేక దినోత్సవాన్ని బ్లాక్ డేగా నిర్వహిస్తూ వనపర్తి జిల్లా సీపీఎస్ ఉద్యోగుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో నిరసన తెలిపారు. జీఓ 28 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ విధులకు హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న రాష్ట్రంలో బాధిత సీపీఎస్ ఉద్యోగులతో ఎలాంటి సంప్రదింపులు జరపడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర సహాధ్యక్షుడు బ్యాంగి కృష్ణప్రసాద్, సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి మోహన్, జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సాయిచందర్, మహేశ్వరచారి, రాజు, గోపాల్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.





మాందాపూర్‌లో మురుగు నీటి నిల్వను పరిశీలిస్తున్న డాక్టర్



వీపనగండ్లలో కరపత్రాలు విడుదల చేస్తున్న సిబ్బంది



జూరాల గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు

అమరచింత: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం చూపితే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని డీపీఓ రమణమూర్తి అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయని, వీటిని నివారించే పనుల్లో పంచాయతీ కార్యదర్శులు ముందుండాలన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి వాటి మరమ్మతు కోసం మిషన్ భగీరథ అధికారులకు నివేదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం అన్నారు. పాంరెడ్డిపల్లి శివారులోని కేజీబీవీ పాఠశాలలో వారు పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థినులకు కంటి పరీక్షలతో పాటు రక్త నమూన పరీక్షలు చేశారు.

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4 వ వార్డులో కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో, మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

కొత్తకోట రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 8వ వార్డు కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 8వ వార్డులోని శిశుమందిర్ కాలనీలో ఇళ్ల పక్కన గల పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారు.

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో మండల ప్రత్యేక అధికారికి సుషిత పర్యటించి గ్రామంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో టెమిఫాస్ పిచికారీ చేయడంతోపాటు ఆయిల్ బాల్స్ వేసినట్లు పేర్కొన్నారు.

వనపర్తి మండలంలో..

నాచహల్లిలో ఎంపీడీఓ రాఘవ ఇంటింటికీ తిరుగుతూ కరపత్రం పంచుతూ.. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వనీటిని ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీగౌడ్, ఎంపీడీఓ రవీంద్ర, ఎంపీఓ రాజు, కార్యదర్శి శివ, మద్దిలేటి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిన్నంబావి: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉమ్మడి మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. అమ్మాయిపల్లి ఆయన పర్యటించి, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వీపనగండ్ల: డెంగీ వ్యాధి బారిన పడకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, దోమల కాటును నివారించడం ద్వారా డెంగీ, మలేరియా వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, మహేశ్వరి, ఎల్లమ్మ, కమల, ఆశావర్కర్లు శ్యామల, రాణి, రాధలు అన్నారు.

పాన్‌గల్: కీటకజనిత వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ ప్రజలకు సూచించారు. మండలంలోని చింతకుంట, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి గ్రామాల్లో పర్యటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి కొత్త నీటిని పట్టుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, శ్రీకాంత్, తారాశశాంక్, నిహారిక పాల్గొన్నారు.



నాచహల్లిలో..



అమ్మాయిపల్లిలో..



మిట్టనందిమళ్లలో..



కొత్తకోటలో..

ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీఓ రాజు తెలిపారు. ఇటీవలే బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులు సొంత మండలాల్లో విధులు నిర్వహించరాదని ప్రభుత్వం మరోమారు బదిలీలు చేపట్టిందన్నారు. ఈ బదిలీల్లో అల్లమాయపల్లికి చెందిన ఓమేష్, ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన శరత్‌చంద్ర, వెంకటాంపల్లికి చెందిన రమాదేవి, మల్కిమియాన్‌పల్లికి చెందిన మాసమ్మ, పర్వతాపురం గ్రామానికి చెందిన సుచిత్ర, అప్పారెడ్డిపల్లికి చెందిన వెంకటస్వామి ఇతర మండలాలకు బదిలీపై వెళ్లినట్లు ఆయన చెప్పారు. పాతవారు రిలీవ్ అయిన వెంటనే ఆయా గ్రామాల్లో కొత్త పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు తీసుకుంటారని ఎంపీఓ తెలపారు.

బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్



ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా భాగ్యవర్ధన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, టీజీ విశ్వేశ్వర్, సునీల్, కురుమూర్తి, రాఘవేందర్‌రావు, జమ్మన్న, రాఘవేందర్, లలితమ్మ, చైతన్యరాణి, పావని, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

పాన్‌గల్: మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా పాన్‌గల్ పీఏసీఎస్ చైర్మన్, కేతేపల్లి వాసి మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గోప్లాపూర్‌కు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్, రాజయ్యగౌడ్, బుచ్చన్న, కుర్మన్న తదితరులు విష్ణువర్ధన్‌రెడ్డిని పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

‘భగీరథ’ నీటి సరఫరాలో అంతరాయం

- నాలుగు రోజులుగా నిలిచిన సరఫరా
- గౌరిదేవిపల్లి వద్ద వాల్వ్ బిగింపు

అమరచింత: జిల్లా అంతటా తాగునీటిని అందించే మిషన్ భగీరథ నీటి సరఫరా నాలుగు రోజులుగా నిలిచిపోవడంతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడింది. రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లి వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు జీరో వెలాసిట్ వాల్వ్ బిగింపు పనుల వల్ల కలిగిన అంతరాయంతో జిల్లా అంతటా తాగునీటి ఇక్కట్లు నెలకొన్నాయి. దీంతో మిషన్ భగీరథ అధికారులు వీటి మరమ్మతు పనుల కోసం నాలుగు రోజుల నుంచి కృషి చేయడంతో గురువారం గోపాల్‌పేట మండలంలోని పంప్ హౌజ్‌కు నీటిని అందించగలిగామని మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి తెలిపారు. జిల్లాలోని మిగిలిన తాగునీటి పథకాలకు శుక్రవారం రాత్రి నుంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ట్యాంకర్లతో అందని నీరు

మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందుల కారణంగా అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నా.. ప్రజలందరికీ నీటిని అందించలేని పరిస్థితి దాపురించింది. అమరచింత మున్సిపాలిటీలోని పది వార్డుల పరిధిలో కేవలం రెండు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నా.. అవి ప్రజలకు కాకుండా రాజకీయ నాయకుల ఇళ్లకే చేరుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఆత్మకూర్ మున్సిపాలిటీలో సైతం ట్యాంకర్లతో నీటిని అందించలేకపోతున్నారని పట్టణ ప్రజలు నీటి కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు.



అమరచింతలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

చర్యలు చేపడుతున్నాం

నాలుగు రోజులుగా మిషన్ భగీరథ తాగునీటిని ఆయా పంప్ హౌజ్‌లకు అందించడంలో అంతరాయం కలిగింది. రేవల్లి మండలంలోని గౌరిదేవిపల్లి వద్ద ప్రధాన పైప్‌కు జీరో వెలాసిట్ వాల్వ్ అమర్చేందుకు కృషి చేస్తున్నాం. శుక్రవారం రాత్రి వరకు పనులు పూర్తిచేసి తాగునీటి సరఫరా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మేఘారెడ్డి, ఈఈ

బాలిక అదృశ్యం

పాన్‌గల్: బాలిక అదృశ్యమైన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం తండాకు చెందిన బాలిక (19) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించిన బాలిక శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన బీజేపీ నాయకుడు రమేష్ చిన్నాన్న భూతగాళ్ల కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు శుక్రవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అన్వేష్, రమేష్ ఉన్నారు.

పోచమ్మ తల్లీ చల్లంగా చూడు..



బోనాలతో పోటెత్తిన భక్తులు, ప్రజలు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, దళితవాడ, ప్యాటగడ్డ, ఇందిరాకాలనీ, మార్రెమ్మకుంట రోడ్డు, టౌన్‌చర్చి వీధి, జమ్మిచెట్టు కాలనీలో ప్రజలు శుక్రవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కత్రెమ్మ, పోశమ్మకు మొక్కులు సమర్పించారు. డప్పువాయిద్యాలతో సంప్రదాయబద్ధంగా మహిళలు పెద్ద ఎత్తున పసుపు, కుంకుమ, వేపాకు, సున్నంతో అలంకరించిన బోనంలో అమ్మవారికి నైవేద్యం తయారు చేశారు. అనంతరం ఆయా కాలనీల గుండా ఊరేగింపుగా బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కోళ్లను బలిచ్చారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

వనపర్తిని, రాష్ట్ర ప్రజలను సల్లంగా చూడు తల్లి అని కత్రెమ్మ, పోశమ్మలను ఎమ్మెల్యే మేఘారెడ్డి వేడుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, డీసీసీ మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళా భక్తులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి

కొల్లాపూర్: ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలతో పాటు పురుషులకు కూడా ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో సీట్ల పరిమితికి మించి మహిళలు ఎక్కుతున్నారన్నారు. దీంతో పురుషులకు కూర్చునేందుకు సీట్లు కూడా దొరకడం లేదన్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్త్రీలతో పాటు, పురుషులకు జీరో టికెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేకుంటే టికెట్ కొనేవారికి ఖచ్చితంగా సీటు కేటాయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మహేష్, రాజు, ప్రవీణ్, నవీన్ తదితరులున్నారు.

సాగు నీరు ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లలోని వీరమనాయిని చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు ఇవ్వాలని సీపీఎం మండల నాయకులు సురేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గ్రామంలో రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి జీవనాధారం అయిన వీరమనాయిని చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు ఇవ్వడంలో స్థానిక పాలకులు విఫలమయ్యారన్నారు. చెరువుకు సింగోటం రిజర్వాయర్ దాదాపు కిలోమీటరు దూరమే ఉందన్నారు. నీరు విడుదల చేయకుంటే ఈ నెల 27 నుంచి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

మహిళా జర్నలిస్టులపై దాడి సరికాదు

వనపర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిపై జరిగిన దాడిని పెబ్బేరు మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గొడుగు బాలవర్ధన్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం అమానుషమని.. ప్రశ్నించే గొంతును నొక్కడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని వివరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధానకార్యదర్శి పరశురాములు, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్‌గౌడ్, బాషా, గౌరవ సలహాదారు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు బాలవర్ధన్

విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

ఖిల్లాఘనపురం: ప్రజలు రోగాల బారిన పడుతుంటే మీరంతా ఎందుకున్నట్లు, కనీసం డెంగీ వ్యాధి వచ్చిన వ్యక్తి ఇంటి పరిసరాలు పరిశీలించి వారికి సూచనలు చేయకుండా ఏమి చేస్తున్నట్లు అని కలెక్టర్ ఆదర్శ సురభి వైద్యసిబ్బంది, ఆశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే లో భాగంగా మండలంలోని సోళీపురం గ్రామాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాల పరిస్థితులను తెలుసుకున్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం గ్రామంలోని శివమ్మకు డెంగీ వ్యాధి సోకడంతో పెద్దాస్పత్రికి తరలించారని తెలియడంతో నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. సమీపంలోనే ఖాళీ ఇనుప డబ్బాలో నీరు నిల్వ ఉండడంతో ఆరోగ్య ఉపకేంద్రం వైద్యులు జ్యోతి, ఏఎన్ఎం బాల్‌నర్సమ్మ, ఆశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి జిల్లా ప్రోగ్రాం అధికారి సాయినాథ్‌రెడ్డికి సూచించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

మండలంలోని ఎస్టీ హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు హెచ్‌ఎం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భోజనశాల, వంటగది, సామగ్రి నిల్వ ఉంచే గది, పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌ఎం శ్రీదేవికి పలు సూచనలు చేశారు.



ఎస్టీ హాస్టల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మెరుగైన వైద్యమే లక్ష్యం

సీహెచ్‌సీలో 24 గంటల పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య సిబ్బందికి సూచించారు. ఓపీ, ల్యాబ్, మందులు నిల్వచేసే గది, తాగునీటి ప్లాంట్ తదితర వాటిని పరిశీలించారు. ఆస్పత్రిలో 2 గంటలు దాటితే వైద్యులు ఎవ్వరూ ఉండరని పేరుకే 24 గంటల ఆస్పత్రి అని, సాధారణ కాన్పులకు కూడా జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తారని కొందరు గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వైద్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండునాయక్, ఏఓ మల్లయ్య, ఎంపీఓ రాజు, పీఆర్ఏఈ రమేష్‌నాయుడు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని విద్యార్థుల రాస్తారోకో

అమరచింత: పాఠశాల, కళాశాలల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలంటూ శుక్రవారం మండలంలోని మస్తీపురంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవ మాట్లాడుతూ.. ఆత్మకూర్ నుంచి గద్వాలకు బస్సులు లేకపోవడంతో చాలామంది రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందిమళ్ల, కిష్టంపల్లి, చంద్రగఢ్, మస్తీపురం గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు నిత్యం ఆత్మకూర్, గద్వాల ప్రాంతానికి వెళ్లి చదువుకొంటున్నారని.. గద్వాల డిపోకు చెందిన ఒకేఒక బస్సు ఆయా గ్రామాల మీదుగా నడుస్తుండటంతో విద్యార్థులతో పాటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిత్యం నాలుగు షటిల్ బస్సులు నడిపించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చరణ్, సందీప్, వినయ్ పాల్గొన్నారు.



